
# అందీ అందని ద్రాక్ష

## సీతా సత్య

నోట్లో వెండి చెంచాతో పుట్టిన నరేష్‌కు యుక్తవయసులో ఒక అద్భుతమైన కోరిక కలిగింది.

ఓ బీద అమ్మాయిని ప్రేమించి పెళ్ళిచేసుకుని తద్వారా ఆమె కళ్ళలో వ్యక్తమయే కృతజ్ఞతాభావనను కొంచెం కొంచెంగా ఆస్వాదిస్తూ జీవితాన్నంతటినీ ఆనందంగా గడి పేయాలనే అతడి కోరికకు సినిమాలూ, పత్రికలూ పునాదిరాళ్ళయ్యాయి.




చదువు పూర్తిచేశాక ఉద్యోగమే చేసి బ్రతకాల్సిన అవసరమతడికి లేక పోవడంతో, తండ్రి చేస్తోన్న వ్యాపా రాన్ని చూసుకోవడం మొదలుపె ట్టాడు.

పిల్లలకు యుక్తవయసొచ్చాక, తమ మీదేదో భారం వున్నట్టుగా అనిపించడం, వాళ్ళకు పెళ్ళిళ్లు చేసి చట్రాలలో బిగిస్తేనేగానీ ఆ భారం తమ మీది నుంచి దిగిపోయినట్టుగా అనిపించకపోవడం సహజమని భావించేవారి కోవకే చెందినవారతడి తల్లిదండ్రులు. అందుకే వారేమా త్రమూ ఆలస్యం చేయకుండా అటూ ఇటూ మూడు జిల్లాల్లో తమ పుత్రరత్నానికి సరైన జోడీని వెదకడం కోసం చేయాల్సిన ప్రయ త్నాలన్నీ చేయడం ప్రారంభించారు.

తన ప్రమేయం లేకుండా తల్లిదం డ్రులు తనకు సంబంధాలు వెదుకు తున్నారని తెలిసిన నరేష్ మొదట్లో కలవరపడినా, తన తల్లిదండ్రుల గురించి బాగా తెలిసినవాడు కావ డాన, ఇప్పట్లో వారిద్దరూ ఏకాభిప్రా యానికి రారనే విషయం స్ఫురించ డంతో సంబరపడ్డాడు.

కానీ రష్యా, అమెరికాలొక విషయం మీద ఏకాభిప్రాయానికి రావడమనేది ఎంత అరుదైన, ఆశ్చ ర్యకరమైన విషయమో, అంతకంటే చిత్రంగా ఓ శుభోదయాన తల్లిదం డ్రులిద్దరూ ఓ బస్ట్ సైజు ఫోటో చూపించి, 'నీక్కాబోయే పెళ్ళాన్ని కసారి చూసుకోరా!" అని ముక్త కంఠంతో అన్నపుడు తను పడిన



సంబరమంతా మూణ్ణాళ్ళ ముచ్చటే అనిపించిందతడికి.

ఎంతో బాధపడుతూ ఆ ఫోటో వైపు యాంత్రికంగా చూసిన అతడి గుండె లయతప్పింది. ఎంతో అద్భుతంగా కనిపించిందా ఫోటోలోని అమ్మాయి అతడి కళ్ళకు.

ఆమె మొహంలో వంకపెట్టదగ్గ భాగమేమీ లేకపోగా, ప్రతి అవయవమూ ఇలా వుంటేనే అందంగా వుంటుందన్నట్టుగా, అందానికి నిర్వచనంలా వున్న ఆ అమ్మాయి ఫోటో చూడడంతో, తన కోరికను తాత్కాలికంగా మరచిపోయాడు నరేష్.

అమెరికా, రష్యా లెందుకేకమయ్యాయో ఎవరూ చెప్పనవసరంలేకుండానే అర్థమైందతడికి. మొదట ఆసక్తిలేనట్టుగా చూసిన కొడుకు కళ్ళు తరువాత తదేక దీక్షతో ఆ ఫోటో నంటిపెట్టుకుపోవడాన్ని గమనించిన దంపతులిద్దరూ ముసిముసిగా నవ్వుకున్నారు.

* * *

కళ్ళెదురుగా ఆడుకొంటోన్న పిల్లల్ని మురిపెంగా చూస్తోన్న విజయ వైపు పరీక్షగా చూశాడు నరేష్. పెళ్ళై దాదాపు ఆరు సంవత్సరాలైనా ఆమెలోని అందం లేశమైనా తగ్గలేదు.

కానీ గత ఆరేళ్ళుగా మనసు పొరల్లో వుండిపోయిన అతడి కోరిక గత కొద్ది రోజులుగా తరచూ పైకొస్తోంది. అందుకు కారణం, భార్య మీద అతడికున్న ప్రేమ తగ్గడం కాదు.

ఎంత అద్భుతమైన వస్తువునైనా రోజూ చూస్తే కొంత కాలానికి ఆ వస్తువులో ఏ ప్రత్యేకతా కనబడదు. అతడి దృష్టిలో తన భార్య ఒక అద్భుతమైన వస్తువు! ఆరేళ్ళ సంసారం చేయడంతో 'అద్భుతం' అనే విశేషణం అతడి మనసులోంచి చెరిగిపోయి 'తన భార్య కేవలం ఓ అందమైన వస్తువు. అంతే!' అనే భావనను మిగిల్చిందతడికి.

మగవాడికా భావన మదిలో ఒకసారి కలగాలేగానీ, అద్భుతమైన అనుభవం కోసం అతడు ప్రయత్నించడానికి కెంత సమయం కావాలి?

మిగిలిన వారికెంత సమయం పడుతుందో గానీ, అతడికి మాత్రం ఇరవై నాలుగ్గంటల తర్వాత తన ఆలోచనను అమలులో పెట్టవలసిన పరిస్థితి కళ్యాణి రూపంలో ఎదురైంది.

కళ్యాణిని చూడడం అతని కది మొదటిసారి కాదు. కనీసం రోజుకు రెండు సార్లు చొప్పున గత రెండు సంవత్సరాలుగా అతడామెను చూస్తూనే వున్నాడు. అతడి ఆధ్వర్యంలో వున్న కానింగ్ ఇండస్ట్రీలో ఆమె పనిచేస్తోంది.

స్వతహాగా పని మీద శ్రద్ధ వున్నవాడు కావడం చేత రోజుకు నాలుగైదుసార్లు ఆఫీస రూమ్‌లోంచి బయటకు వచ్చి పనితీరును పర్యవేక్షించడం నరేష్‌కు అలవాటు.

ఒక రోజు, చుక్కల మధ్య చంద్రుడిలా వెలిగిపోతోన్న కొత్తమ్మాయిని చూసి కాస్సేపక్కడే నిలబడి, ప్రపంచంతో ఏ సంబంధమూ లేనట్టుగా పనిలో లీనమైన ఆ అమ్మాయినీ, పనికనుగుణంగా కదుల్తోన్న ఆమె చేతుల్నీ గమనించి ముచ్చటపడ్డాడతడు.

మొదట్లో ఆమె పనితీరును మరింత శ్రద్ధగా గమనించడం కోసం రోజులో ఎక్కువసార్లు అక్కడికొచ్చే నరేష్ తర్వాత్తర్వాత తనకు తెలియకుండానే కేవలం ఆమెను చూడడం కోసం అక్కడే చాలాసేపు నిలబడేవాడు.

ఆ రోజు – ఎప్పటిలానే ఆ హాలులోకి వచ్చి ఓ వారగా నిలబడి తన దృష్టినామె మీదే కేంద్రీకరించిన నరేష్, ఆమె తల ఇటు తిప్పడంతో ఓసారి తడబడి, మరుక్షణం ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు.

ఆమె కళ్ళు ఒక్కక్షణం కలవరపడి కనురెప్పల చాటున దాక్కున్నాయి. ఆడదాని అందానికి సిగ్గు ఎంత అద్భుతమైన అలంకారమో తెలిసిందతడికి మొదటిసారిగా.

ఆ వెనువెంటనే, కళ్యాణి లాంటి అమ్మాయిని చేసుకుని వుంటే, జీవితాంతమూ ఆమె సిగ్గుల దొంతర్లలో తేలియాడుతూ తనెంతటి ఆనందాన్ని స్వంతం చేసుకుని వుండేవాడోననిపించిందతడికి.

తన భార్య విజయ కూడా సిగ్గుపడుతుంది. కానీ ఓ ధనికురాలైన స్త్రీ, మరో ధనికుడి భార్యగా ఎంత సిగ్గుపడగలదో, అంతవరకే ఆమె సిగ్గు పరిమితం.

కానీ తన అంతస్తుతో పోలికలేని కళ్యాణి సిగ్గుపడుతోంటే ఎందుకో నిజమైన సిగ్గంటే ఆదేననిపించిందతడికి.

భర్తల ముందు భార్యలు సిగ్గుపడే సందర్భాలు• అరుదు. అటువంటి అరుదైన సందర్భాల్లో కూడా చాలా అరుదుగా సిగ్గుపడుతుంది విజయ. అంతేకాకుండా కేవలం సిగ్గుపడడం కోసమే ఆమె సిగ్గుపడినట్టుగా అనిపించిందతడికి చాలాసార్లు.

కళ్యాణి సిగ్గుల్నితన స్వంతం చేసుకునే అవకాశం లేదా?

ఆమెను మరింత దగ్గరగా గమనించేందుకు, బాటిల్స్ క్లీన్ చేసే సెక్షన్‌లోకి మార్చాడు నరేష్. అతడి ఆఫీస్ రూమ్‌కు బిగించి వున్న అద్దాల్లోంచి అతి స్పష్టంగా కనిపిస్తుందామె. మరో నాల్రోజులామెను నిశితంగా పరిశీలించాక తట్టుకోలేని స్థితి ఏర్పడిందతడికి.

కనీసం పది నిముషాలకోసారి చిరునవ్వులుచిందిస్తోందామె, తనతోటివారి ముందు. పొట్టకూటి కోసం కూలిపని చేసుకునే స్త్రీ అంత హాయిగా నవ్వుతూ, త్రుళ్ళుతూ పని చేసుకుంటూ జీవితాన్నెలా గడపగలదనే విషయం అతడికెంత ఆలోచించినా అర్థంకాలేదు. ఆ విషయం అర్థం చేసుకుందుకామె గురించి ఆరాతీశాడు.

కళ్యాణి భర్త ఓ చిన్న సైజు కంట్రాక్టరు వద్ద తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. తను రోజూ సంపాదించే డబ్బులో మూడొంతులకు పైగా త్రాగుడికే ఖర్చుపెట్టాలని దేవుడి ముందు ఒట్టు వేసుకుని, పెళ్ళయినప్పటి నుంచీ, ఒక్కరోజు కూడా తన ఒట్టుకు భంగం కలిగించకుండా వుండేందుకు, ఆమె భర్త అహరహమూ కృషి చేస్తూండడంతో – అప్పటికే ఇద్దరు పిల్లలకు తల్లైన కళ్యాణికి, రోజూ పిల్లల కింత తిండి పెట్టడం కోసం కూలి పని చేయడం తప్పనిసరైంది.


అటువంటి పరిస్థితుల్లో కూడా, ఆమె నవ్వుతూ, పళ్ళు దాచుకోకుండా పనిచేస్తోందనే విషయం తెలిశాక అతడి ఆశ్చర్యం పెరిగిందే తప్ప తగ్గలేదు.

ఓ రోజు ఆమెను పిలిపించి అడిగాడు నరేష్ "నీకిక్కడ పనేమీ కష్టంగా లేదు కదూ?"

కళ్యాణి మొహంలో ఆశ్చర్యం తొంగిచూసింది. తనలాంటి వారెంతోమంది వుండగా తననే ప్రత్యేకంగా పిలిచి అతడలా అడుగుతాడని ఆమే నాడూ ఊహించలేదు.

"కష్టవంటే ఎలా కుదుర్తుందండీ? పొట్ట గడవడం కోసం కష్టమైనా, నష్టమైనా ఏదో పని చేయక తప్పదు కదా?" అందామె మామూలుగా.

నరేష్ తడబడ్డాడు – తన మాట



లకు సరైన అర్థం ఏవిటో ఆమెకు స్ఫురించనందుకు. "నేనడిగేదది కాదు. ఇంతకు ముందు నువ్వు చేసిన పనికంటే ప్రస్తుతం నువ్వు చేస్తోన్న పని తేలిగ్గా వుందా? అని అడుగుతున్నాను" అన్నాడు నరేష్.

కళ్యాణి నవ్వింది.

ఆ నవ్వుకు చిత్తైపోయి, ఇంకే మనాలో తెలియక, "సర్లే... సర్లే రేపట్నుంచీ నువ్వు బాటిల్స్ కడగ డంమానేసి వాళ్ళెలా కడుగుతున్నారో జాగ్రత్తగా చూస్తూండు" అన్నాడు.

ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసిందామె.

నోటితో చెప్పకపోయినా, అతడికి తన మీదేదో ప్రత్యేకమైన అభిమానం వుందనే విషయం మాత్రం స్పష్టమైందామెకు.

ఆ తరువాత... తన అభిమానాన్ని వీలైనన్నిసార్లు, వీలైనంత విశదంగా ఆమె కర్థమయ్యేలా వ్యక్తం చేయకపోతే అతడికారోజు వెలితిగా గడిచేది.

అతడు తన నాప్యాయంగా పలకరించినపుడల్లా, తాగొచ్చి మీదపడే భర్త గుర్తొచ్చేవాడామెకు. తరువాత్తర్వాత, కేవలం ఇంటికి వెళ్ళినపుడు తప్ప, భర్త ఆమె స్మృతిపథంలోకి రావడం మానేశాడు.

ఓసారి ఎవరూ చూడకుండా అడిగిందతణ్ణి "నేనంటే మీకెందుకింత అభిమానం?"

ఆమె పట్ల తను చూపిస్తోన్న అభిమానాన్నామె గుర్తించి అదే విషయం తననడగడంతో పొంగిపోయాడు నరేష్. ఆ పొంగు - అతడికి తన భార్యాపిల్లల్ని తాత్కాలికంగా మరచిపోయే అవకాశాన్ని కలిగించింది.

"ఎందుకంటే... ఎందుకంటే..." అని ఆగాడు నరేష్.

తలెత్తి చూసి, కళ్ళు రెపరపలాడించి, పెదాలు సిగ్గుగా విడదీసిందామె.

"... నువ్వంటే నా కిష్టంకనుక..." చెప్పదలచుకున్న విషయాన్ని పూర్తిచేశాడు నరేష్. ఆమె ఉలిక్కిపడింది. ఆమె దేహంలోని ప్రతి అణువూ పులకరించింది. అంత ఆనందం, అటువంటి అనుభూతీ ఆమెకెన్నడూ కలగలేదు. దించినతలను పైకెత్తే శక్తిని పూర్తిగా కోల్పోయిందామె.

చేష్టలుడక్కి నిలబడిన కళ్యాణిని చూస్తోంటే - కొద్ది క్షణాల్లో తన కన్యాత్వాన్ని భర్తకర్పించబోయే స్త్రీ, శోభనం రాత్రి సిగ్గుపడినట్టుగా అనిపించిందతడికి. ఇంకా ఏదో మాట్లాడి, ఆమెను మరింత పులకించిపోయేలా చేసి, తన వంతు ఆనందంతనూ పొందాలని అతడికున్నా, అందుకది అనువైన ప్రదేశం కాదనే విషయం స్ఫురించి, "ఇక్కడొద్దులే. రేపు సాయంత్రం ఆరు గంటలకు శివాలయం దగ్గరకు రాగలవా?" అన్నాడు నరేష్.

ఆమె గుండె లయ తప్పింది. పాదాలు తడబడ్డాయి. పెదాలు వణికాయి. ముక్కుపుటాలదిరాయి. కంపించే గొంతుతో అడిగిందామె, "ఎం..దు..కు..?"

ఆమెకు సమాధానం చెప్పేందుకతడక్కడ లేదు.

బరువెక్కిన గుండెతో ఇంటికి చేరుకుంది కళ్యాణి. ఆ రాత్రంతా ఆమె మనసు మనసులో లేదు. రోజూ వళ్ళెరక్కుండా నిద్రపోయే కళ్యాణి - క్షణాన్నొక యుగంలా గడిపిందా రాత్రి.

మర్నాడు పనికెళ్ళేందుకామెకు మనస్కరించలేదు. ఏదో తప్పు చేయబోతున్న భావన ఆమె మదంతా నిండిపోయింది. కానీ సాయంత్రమయ్యేసరికి తన మనసు నదుపులో వుంచుకోవడమామెకు సాధ్యం కాలేదు.

రేకు పెట్టె తీసి, చాలాకాలం క్రితం కొని దాచుకున్న చీరను బయటకు తీసింది.

* * *

శివాలయం దగ్గర అరగంటసేపట్నుంచి అసహనంగా ఎదురుచూస్తోన్న నరేష్ మొహం వికసించింది - తన కభిముఖంగా నడిచివస్తోన్న కళ్యాణిని చూడగానే.

అతడప్పుడు కారు ఫ్రంట్ సీట్‌లో కూర్చునివున్నాడు. ఆమెను కారు

# వేషాల్లేవు

అన్నం అప్పటిలానే-
కళావేశం కాళ్ళు నిలవనీక,
జేబు నిండుకున్నాక నిలవ నీడలేక,
చూసినవాడికి మొహం నచ్చక-
వచ్చేసిన చోట తిరిగి మొహం చూపలేక
ఒక్క పూట ఆకలిని
ఎన్ని అధమ పాత్రల్లోనో జీవింప చేసినప్పటిలానే-
ఊహూహూ- కాదు- కాదు
అప్పడీ జాలిచూపులూ జారుతున్న విలువలూ లేవు.
అతిథి పాత్రలూ, వృద్ధ పాత్రలూ సరిపెట్టుకోవడానికి
ఇమేజ్ పేరుతో అడ్డొచ్చే అహమూ లేదు.
సలహా కోరి సాగనంపే హిపోక్రసీ తప్ప
అప్పటిలా లేదు పొమ్మనే నిష్కర్షా లేదు.

క్షణానికో అక్షౌహిణిగా ప్రభవించే
వైరి వైర స్పష్టత లేని అనిత్యాదృష్ట
హిట్ అండ్ రన్ పందెంలో
క్షతగాత్రమైన శరీరానికి- శత దినోత్సవ లేపనం కోసం
తహతహల తపస్సు చేస్తూనే-
బిజీ అని చెప్పలేని సాయంత్రాన్ని
ఎవరిదో అభినందన సభలో గడుపుతూ
ఈర్ష్య కాని బాధకూ- సందర్భసహిత వ్యాఖ్యకూ మధ్య
డబ్బింగ్ చెప్పటం-
నటనావధికి మించిన అవధానమవుతుంది.

కావచ్చు!
వర్తించదగిన రంగాలింకెన్నో ఉండొచ్చు.
భుజం మార్చుకొని మోయగలిగిన సత్తువా ఉండొచ్చు.
వెనుకటి అపజయం పోస్టర్‌పై పేడ మరకలా కనిపిస్తుంటే-
ఖాళీ పెట్టె జీవితాన్ని
నోట్ల కట్టలతో నింపటమే సార్థకం కాదనిపిస్తుంది.
అసంతృప్తితో వచ్చిన మాగన్నులో
ఆస్కార్ కల వస్తుంది.

పేకప్‌తో
మయసభ సెట్టు అట్ట ముక్క లైనట్టు
లైట్సాఫ్‌తో-
మేకప్ వీలి వీడన
దిష్టి బొమ్మగా నిలబెట్టినట్టు
కట్... కట్... కట్
మొన్నా నిన్నా నేడుగా
జీవితం మూడు ముక్కలై తెగిపడ్డా
రంగూ రూపూ గొంతూ,
ఏదీ నిజం కాని చోట
అంతా తానుగా వ్యాపించాలనే తపనలో
ప్రాణం గిజగిజగిజా కొట్టుకుంటూనే వుంటుంది. - పాటిబండ్ల రజని

దగ్గరకు రానిచ్చి, "కళ్యాణీ' ' అని పిలిచాడు.

వడివడిగా ఆలయం వైపు నడిచివెళ్తోన్న కళ్యాణి చెదిరిన గుండెలతో కారు వైపు చూసి, నరేష్‌ను గమనించి, చుట్టుప్రక్కల జాగ్రత్తగా పరిశీలిస్తూ అప్పటికే డోర్ తెరచి పట్టుకున్న నరేష్ వైపు తేలికపడిన మనసుతో చూసి, చిరునవ్వు నవ్వి అతడి ప్రక్కనే ముందు సీట్లో కూర్చుంది.

ఓ చేత్తో డ్రైవ్ చేస్తూ, మరో చేత్తో ఆమెను పొదివిపట్టుకుని – ఆమె అంతవరకూ వినని విషయాలెన్నిటినో అద్భుతంగా చెప్పాడతడు.

అతడు చెప్పిన మాటలన్నిటిలోనూ ఆమెకర్థమైందీ, అతిగా నచ్చిందీ, 'నాకు పెళ్ళిగాక ముందు నువ్వు కనబడివుంటే నిన్నిలా దొంగచాటుగా కల్సుకునే అవసరం నాకుండేది కాదు" అనే వాక్యం.

అంటే... పెళ్ళికి ముందు తనతడి కళ్ళబడి వుంటే అతడితో మనసునూ, శరీరాన్నీ పంచుకుని అతడి అర్థాంగి అయ్యుండేదన్న మాట! ఆ ఊహే ఎంతో తియ్యగా అనిపించిందామెకు.

ఆ పరిస్థితిలో మగాడేం చేస్తే మాత్రం వద్దంటుంది ఆడది?

అయినా నరేష్ ఆమెను ఏమీ చేయలేదు.

అవకాశం వుండి కూడా ఏమీ చేయని అతడి వ్యక్తిత్వం ఆమె కెంతగానో నచ్చింది. అతడికా అనుభవం అక్కర్లేకపోయినా, ఆమెకు మాత్రం ఎందుకో అతడ , తన నుంచి ఏమీ ఆశించకపోవడ నచ్చలేదు.

రాత్రి తొమ్మిది గంటలకు, ఆమె ఇంటికి వెళ్ళే సందు మొదట్లో కారాపి, డోర్ తెరిచి, ఆమె దిగాక చేయి ఊపి, "మళ్ళీ రేపు" అని కారు స్టార్ట్ చేశాడు నరేష్.

ఆ ఊహకెంతో ఆనందంగా వుంది – పెళ్ళయ్యాక కూడా ఒక మగవాడి దగ్గరగా, 'నువ్వే నా లోకం' అన్నంత ఇదిగా మరో ఆడది వస్తుందని అతడేనాడూ అనుకోలేదు. కానీ కళ్యాణి తనకంత దగ్గరగా వచ్చిందనే విషయాన్నతడు మరచిపోలేకపోతున్నాడు.

మూడు నెలల తర్వాత కళ్యాణితో అన్నాడు నరేష్, "రేపట్నుంచి నేను నీతో చనువుగా వుండడం లేదని నువ్వు బాధపడకూడదు. ఈ మూడు నెలల్లోనూ మన శరీరాలేకం కాకపోయినా మనసులొకటయ్యాయని నీకు తెలుసు. అయినా సమాజంలో నా స్థానం కూడా నేను చూసుకోవాలి కదా!

ఇప్పటికే మనిద్దరి వ్యవహారమూ ఎంత దాచాలనుకున్నా దాగని స్థితికి వచ్చేసింది. అందుకే, ఇక నుంచి నేను నీతో మాట్లాడకపోతే అందుకు నువ్వు బాధపడకూడదు."

వెర్రిదానిలా చూసింది కళ్యాణి అతడి వైపు.

'నీ కోసం ఈ ప్రపంచాన్నంతటినీ ఎదిరిస్తాన'ని చెప్పిన వ్యక్తేనా ఇతడు?

తన జీవితంలోకి అతడు ప్రవేశించకుండా వుండుంటే, తాగుబోతు భర్తతోడే లోకమనే భావనలోనే మిగిలిన జీవితమూ గడిపేది తను.

తనకు పెళ్ళయిందని తెలిసీ అతడు తనకు దగ్గరగా వచ్చినపుడు, "నువ్వు లేకపోతే నేను లేన" ని అతడన్నపుడు, అవకాశం వున్నా తనను కోరని అతడి వ్యక్తిత్వాన్ని చూసి ఎంతగా ఆరాధించిందతణ్ణి?

మొదటి నుంచి గంజి త్రాగేవాడు జీవితాంతమూ అదే త్రాగడానికెంత మాత్రమూ బాధపడడు. కానీ కొన్నాళ్ళపాటు రోజూ పాయసం రుచి చూపించి, తిరిగి 'నీ గంజేదో నువ్వు త్రాగు!' అంటే ఎలా వుంటుంది?

దాహపు బాధ తెలియని వ్యక్తిని పరుగెత్తించి, గుక్కెడు నీళ్ళు అతడి దోసిట్లో పోసి, 'ఇహ నా దగ్గర నీళ్ళు లేవు. నిన్ననవసరంగా పరుగెత్తించినందుకు నేను బాధపడుతున్నాను. నువ్వు కూడాబాధపడకు!' అన్నంత మాత్రాన అతడిలో జనించిన దాహమెలా తీరుతుంది?

కళ్యాణి రెండు చేతులూ జోడిస్తూ అంది, "మీ దయకు కృతజ్ఞురాల్ని. ప్రేమనే పదం ఒకటుందనే విషయం తెలియని నాకు – మంచికో, చెడుకో ప్రేమంటే ఏవిటో తెలియజేశారు. సర్వదా అందుకు ధన్యురాల్ని. పూరి గుడిసెల్లో వెళ్ళమారవలసిన నా బ్రతుకును భవంతి ప్రాంగణం వరకూ తీసుకువెళ్ళారు.

కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి. పూరిగుడిసెలో వుండే వ్యక్తిని భవనంలోకి ఆహ్వానించే ముందు, ఆ భవనంలో ఆ వ్యక్తిని కలకాలం వుండనిచ్చే గుండె నిబ్బరం లేదా సహృదయం మీకుందో లేదో ఆలోచించుకుని మరీ ఆ పని చేయండి. మీకా శక్తి లేనపుడు, ఎవరి మానాన వారిని బ్రతకనీయండి. ఇదొక్కటే నా కోరిక!"

ఆలోచనలోపడ్డాడు నరేష్.

కళ్యాణి కోరికను గురించి అతడాలోచిస్తున్నాడనుకుంటే అది పొరపాటే అవుతుంది. ఈ మధ్య, తన భార్య విజయలో ఏవో కొత్త కొత్త అందాలు గోచరిస్తున్నాయతడికి. తమింటి ఎదురుగా వున్న పెంకుటింట్లోని కుర్రాణ్ణి చూసినపుడల్లా తరచూ సిగ్గుల మొగ్గవుతోన్న తన భార్యను, తమ భవన ప్రాంగణం దాటి బయటకు వెళ్ళకుండా నిరోధించే ప్రణాళికను గురించి తీవ్రంగా ఆలోచించడంలో తలమునకలై వున్నాడతడు ప్రస్తుతం.

అందీ అందని ద్రాక్ష తీయన కదా మరి!

---

## ప్రాణాంతక ప్రక్రియ తర్వాత ఆలింగనం

ఈనాడు ప్రాచీన పెళ్ళి సాంప్రదాయాలు కొందరు తు.చ. తప్పకుండా పాటిస్తే, కొందరు నామమాత్రంగా పెళ్ళి తంతులు ముగించుకుంటున్నారు.కొందరు రిజిస్టరు మేరేజీకే ప్రాముఖ్యత యిస్తున్నారు. అయితే కొందరు తమ సరదాలు, మోజులు తీర్చుకునేందుకు ప్రాణం పోయే పద్ధతుల్ని కూడా అవలంబిస్తున్నారు. కొన్ని జంటలు పురోహితునితో జల అగాథంలోకి వెళ్ళి పెళ్ళి తంతును జరిపించుకుంటుంటే, కొందరు ఆకాశంలో విహరిస్తూ ఎంచక్కా పెళ్ళి చేసుకుంటున్నారు. ఇలాంటి చిత్ర విచిత్ర పద్ధతులద్వారా పెళ్ళిళ్ళు జరుపుకోవడం మనం అప్పుడప్పుడు వింటూనే వున్నాం. పెళ్ళి నూరేళ్ళ పంట. సుఖ దుఃఖాల్ని పంచుకుంటూ దీర్ఘకాలం సంసార జీవితం గడపవలసిందే. కాదనరు. కాని పెళ్ళికిముందే ప్రాణాంతక అద్భుత ప్రదర్శనలు జరపడమెందుకు? అని ప్రశ్నించవచ్చు కాని అది వారిసరదా.

ఈ మధ్యనే వరుడు టాయిమోడు, వధువు నౌనీలు ఆకాశంనుంచి దుముకుతూ వివాహమాడారు. అది కూడా మామూలు ఎత్తు నుంచి కాదు. పూర్తిగా 170 అడుగుల ఎత్తు నుంచి.అది భూమిపైన కాదు, అట్లాంటిక్ సముద్రంనీటి అలలపై, తాళ్ళను బంధించుకొని, ప్రాణాంతకమైన




ఈ ప్రక్రియ (దూకుడు) అనంతరం ఎంచక్కా పెళ్ళాడి, ఓ అద్భుత రికార్డును సృష్టించారు.

– నల్లబెల్లి